సాక్షి వికారాబాద్

సోమవారం । 21 । అక్టోబర్ । 2024



అడవి పందులతో పరేషాన్!

మట్టి నుంచి సిరులు పండించే రైతన్నలకు అడవి పందుల బెడద కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. 8లో▸



ఉడా పరిధిలోకి జిల్లా..

జిల్లాను ఉడా కింద ప్రభుత్వం ఎంపిక చేస్తూ జీఓ విడుదల చేసిందని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. 8లో▸



లైబ్రరీల అభివృద్ధికి కృషి

గ్రంథాలయాల అభివృద్ధికి కృషిచేస్తానని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శేరి రాజేశ్‌రెడ్డి పేర్కొన్నారు. 9లో▸

న్యూస్‌రీల్

నేడు కొడంగల్ ఏఎంసీ ప్రమాణస్వీకారోత్సవం

కొడంగల్: వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) నూతన పాలక మండలి సభ్యులు సోమవారం ప్రమాణ స్వీకారం చేస్తారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆనంద్‌రెడ్డి తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి ఆదేశాల మేరకు సోమవారం ఉదయం 11 గంటలకు కేఎస్‌వీ (మురహరి) ఫంక్షన్ హాల్‌లో ఈ కార్యక్రమం ఉంటుందని చెప్పారు. మార్కెట్ కమిటీ అధ్యక్షుడిగా రుద్రారం గ్రామానికి చెందిన అంబయ్య గౌడ్, ఉపాధ్యక్షుడిగా దుద్యాలకు చెందిన ఆకారం వేణు, 13 మంది డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేస్తారని తెలిపారు. సమావేశంలో సంగప్ప తదితరులు పాల్గొన్నారు.

24న కంటి వైద్య శిబిరం

కొడంగల్: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, కలెక్టర్, వైద్యారోగ్యశాఖ, లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 24న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆప్తాల్మిక్ అధికారి లయన్ హరినాథ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. కంటి సమస్యలున్నవారు ఆధార్‌కార్డు తీసుకుని వచ్చి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఆపరేషన్లు అవసరం ఉన్నవారిని మహబూబ్‌నగర్‌లోని కందూరు రాంరెడ్డి ఆస్పత్రికి తీసుకెళ్తారని చెప్పారు. ఆప్తాల్మిక్ అధికారి వెంట లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మురహరి వశిష్ట, పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్‌గుప్తా తదితరులు ఉన్నారు.

పాతవారికే ప్రాధాన్యం..!

ఇందిరమ్మ కమిటీలపై ఆచితూచి అడుగులేస్తున్న ఎమ్మెల్యే

తాండూరు రూరల్: రెండు రోజుల క్రితం సాక్షి దినపత్రికలో వచ్చిన 'ఇందిరమ్మ కమిటీలో అసమ్మతి రాగం' అనే కథనంపై కాంగ్రెస్ వర్గాల్లో చర్చలు మొదలయ్యాయి. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీల నియామకంపై పాత, కొత్త కాంగ్రెస్ శ్రేణుల మధ్య ఆధిపత్య పోరుపై ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆరా తీశారు. కమిటీల నియామకాల్లో పాత నాయకులు, కార్యకర్తలకే ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. తన వద్దకు వచ్చిన కాంగ్రెస్ శ్రేణులతో ఆదివారం ఎమ్మెల్యే మాట్లాడారు. గ్రామాల్లో తన గెలుపునకు కృషి చేసిన కార్యకర్తలకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

మీనమేషాలు

చేప పిల్లల పంపిణీ ఈ ఏడాది ఆలస్యమే

ప్రభుత్వం చేపట్టే చేప పిల్లల పంపిణీ ఈ ఏడాది కూడా ఆలస్యమవుతోంది. నేటికీ టెండర్ల ప్రక్రియ పూర్తి కాకపోవడంతో మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమయానికి చెరువులో చేపపిల్లలు వదలకుంటే వాటి ఎదుగల లోపించి నష్టపోతామంటున్నారు.

- అంచనాలు సిద్ధం చేసినా పంపిణీలో జాప్యం
- నేటికీ 14 చెరువులకే టెండర్లు
- గత ప్రభుత్వం బకాయిలు పెండింగ్‌లో ఉండడంతో ముందుకురాని కాంట్రాక్టర్లు

వికారాబాద్: ఈ సారి చేప పిల్లల పంపిణీ అరకొరేనా...? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వంద శాతం రాయితీతో ప్రభుత్వం అందజేయనున్న చేపపిల్లల పంపిణీ వర్షాకాలం ముగిసినా ముందుకు సాగడం లేదు. సబ్సిడీ చేప పిల్లల పంపిణీ ఎప్పుడు చేస్తారోనని మత్స్యసహకార సంఘాలు ఎదురు చూస్తున్నాయి. మత్స్యశాఖ మూడు నెలలుగా కసరత్తు చేస్తున్నామని చెబుతున్నా.. పంపిణీ ప్రక్రియ ప్రారంభించినా టార్గెట్‌లో రెండు శాతం కూడా పూర్తి చేయలేదు. జూలై నుంచి ఇప్పటి వరకు నాలుగు సార్లు టెండర్లు పిలిచినా ఎవరూ ముందుకు రాకపోవడం వల్లే జాప్యం జరుగుతోందని అధికారులు వెల్లడిస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాలోని 14 చెరువుల్లో 13.40లక్షల చేప పిల్లలు వదిలేందుకు మాత్రమే టెండర్లు పూర్తయ్యాయి. ఇందులో ఒక్క చెరువులో 2.70లక్షల చేప పిల్లలు మాత్రమే ఆ శాఖ వదిలింది. కాగా గతేడాది రాయితీపై పంపిణీ చేసిన చేప పిల్లలకు సంబంధించి టెండర్లు దక్కించుకున్న వారికి ప్రభుత్వం ఇప్పటి వరకు బిల్లులు చెల్లించకపోవడం వల్లే టెండర్లకు ముందుకు రావడం లేదని మత్స్య సహకార సంఘాల నేతలు పేర్కొంటున్నారు. జిల్లాలోని చెరువులు నిండుకుండలను తలపిస్తున్నా చేప పిల్లల పంపిణీ ప్రక్రియ ఆలస్యమయితే చేపల పెరుగుదల సరిగా ఉండదని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని మత్స్య సహకార సంఘాల వారు ఆంధ్రాకు వెళ్లి చేపపిల్లలు కొనుగోలు చేసి తెచ్చి చెరువుల్లో వదలుకుంటున్నారు.



మత్స్యకారులు సొంత ఖర్చుతో తెచ్చుకున్న చేపపిల్లలు

జిల్లాలో ఇలా..

మొత్తం చెరువులు	1,179
చేపలు వదిలేందుకు గుర్తించిన చెరువులు	746
మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు	379
మత్స్యకార సభ్యులు	5,142
ఈ ఏడాది లక్ష్యం	1.29 కోట్ల చేపపిల్లలు, 14.97లక్షల రొయ్యపిల్లలు
టెండర్లు పూర్తయింది	13.40లక్షల పిల్లలకు

నేటికీ టెండర్లకే పరిమితం

జిల్లాలో చేప పిల్లలు వదిలేందుకు అనుకూలంగా ఉన్న చెరువుల వివరాలు ఇప్పటికే మత్స్యశాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. జూలై 15 నుంచి 23 వరకు బిడ్లు వేసేందుకు గడువు ఇచ్చింది. టెండర్ ప్రక్రియ పూర్తి చేసి ఆగస్టులో చేప పిల్లల పంపిణీ ప్రారంభిస్తామని చెప్పిన ఆ శాఖ నేటికీ టెండర్ల ప్రక్రియకే పరిమితమైంది. కేవలం 14 చెరువులకు సంబంధించి పెద్ద సైజ్ చేప పిల్లలు వదిలేందుకు టెండర్లు ఖరారయ్యాయి. చిన్న సైజ్‌కు సంబంధించి పెండింగ్‌లోనే ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 1,179 చెరువులు, కుంటలుండగా 746 చెరువుల్లో చేప పిల్లలు వదలాలని నిర్ణయించారు. ఈ ఏడాది 1.29 కోట్ల చేపపిల్లలు, 14.97లక్షల రొయ్య పిల్లలు వదలాలని టార్గెట్ పెట్టుకున్నారు. జిల్లాలో 139 మత్స్య సహకార సంఘాలు ఉండగా ఇందులో 5,142 మంది సభ్యులున్నారు. చెరువులకు సరిపడా చేపపిల్లలు త్వరితగతిన పంపిణీ చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

నాసిరకం పిల్లలు.. లక్ష్యం చేరని పంపిణీ

చెరువుల్లో చేపపిల్లలు వదిలే విషయంలో అధికారులు ఎంచుకున్న లక్ష్యానికి చెరువుల్లో వదులుతున్న వాటికి ఏ మాత్రం పొంతన ఉండడం లేదు. ప్రతీ ఏడాది ఇదే తంతు కొనసాగుతుంది. లక్ష్యంలో 60 నుంచి 70 శాతం వరకే చేపపిల్లలు వదిలి ప్రభుత్వం చేతులు దులుపుకుంటోంది. గతేడాది 847 చెరువుల్లో చేప పిల్లలు వదలాలని నిర్ణయించారు. జిల్లా పరిధిలోని 1.30 కోట్ల చేపపిల్లలు వదలాలని లక్ష్యంగా పెట్టుకుని 70శాతం లోపే చేపపిల్లలు వదిలారు. వదులుతున్న చేపపిల్లలు సైతం నాసిరకంగా ఉంటున్నాయి. వీటిని చెరువుల్లో వదిలే సమయంలో మూడు నుంచి నాలుగు ఇంచులు ఉండాలి. కానీ ఇవి ఒక్క ఇంచుకు మించి ఉండడంలేదు. నాసిరకం చేపపిల్లలు వదలడంతో పెరుగుదల సరిగా ఉండడం లేదని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు.



పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు

సమ్మేటివ్‌కు సన్నద్ధం

- నేటి నుంచి ఎస్‌ఏ-1 పరీక్షలు
- ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులు సమాయత్తం

ప్రాథమిక పాఠశాలలు	770
యూపీఎస్‌లు	114
ఉన్నత పాఠశాలలు	176
కేజీబీవీలు	18
మోడల్ స్కూల్స్	09
విద్యార్థులు	1,22,556

బొంరాస్‌పేట: ప్రతి ఏడాది దసరాకు పరీక్షలు ముగించుకుని వెళ్లే విద్యార్థులు.. ఈ ఏడాది పండుగ అనంతరం పరీక్షలకు సిద్ధమయ్యారు. ఈనెల 21 నుంచి 28 వరకు నిర్మాణాత్మక పరీక్షలు(ఎస్‌ఏ-1) జరుగనున్నట్లు విద్యాశాఖ పరీక్షల షెడ్యూల్ విడుదల చేసింది. ఇది వరకు ఎఫ్‌ఏ-1, ఎఫ్‌ఏ-2 పరీక్షలు పాఠశాల స్థాయిలో ఉపాధ్యాయులు తయారుచేసుకున్న పరీక్ష పత్రాల ఆధారంగా పరీక్షలు నిర్వహించి విద్యార్థుల ప్రగతిని గణించారు. కాగా ఈ ఎస్‌ఏ-1 పరీక్షలు ప్రభుత్వ విద్యాశాఖ పరంగా తయారు చేసిన పరీక్షపత్రాల ఆధారంగా పరీక్షలుంటాయి.

- ప్రాథమిక పాఠశాలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారు.
- ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఆరు, ఎనిమిది తరగతులకు ఉదయం 9.15 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, ఏడు, తొమ్మిదో తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 4.15గంటల వరకు, పదోతరగతి విద్యార్థులకు ఉదయం 9.15గంటల నుంచి మధ్యాహ్నం 12.15వరకు పరీక్షల సమయం ఉంటుంది.
- వచ్చేనెల 2పరీక్ష పత్రాల పరిశీలన, మార్కుల ఫలితాలు, 5న రిజిస్టర్లలో మార్కులు పొందుపర్చడం, 16న ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశంలో ఒక్కో విద్యార్థి పరీక్షా ఫలితాలపై చర్చిస్తారు.

షెడ్యూల్ ప్రకారం పూర్తి



ఏటా దసరా పండుగ సెలవులకు ముందుగా ఎస్‌ఏ-1 పరీక్షలు ముగిసేవి. ఈ ఏడాది కొంత మార్పు జరిగింది. ఏదేమైనా జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పాఠశాలల్లో సిలబస్ పూర్తి చేసుకుని విద్యార్థులు, ఉపాధ్యాయులు సిద్ధంగా ఉన్నారు. షెడ్యూల్ ప్రకారం పరీక్షలు, వాటి ఫలితాలు పూర్తవుతాయి.

– రేణుకాదేవి, డీఈఓ, వికారాబాద్

ప్రకృతి వ్యవసాయమే ఉత్తమం

- సుభాష్ పాలేకర్ విధానాలు పాటించడం అభినందనీయం
- శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

ధారూరు: వ్యవసాయ రంగాన్ని రక్షించుకోవాలంటే ప్రకృతి వ్యవసాయం ఒక్కటే మార్గమని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. ఆదివారం ఆయన మండల పరిధిలోని బూర్గుగడ్డ ప్రాంతంలోని సేవ్ సంస్థ నిర్వాహకులు విజయరామ్ వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించిన రైతు అవగాహన సదస్సులో పాల్గొని ప్రసంగించారు. దేశీయ విత్తనాన్ని పెద్ద ఎత్తున రైతులకు వద్దకు తీసుకెళ్లేందుకు విజయరామ్ చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. సుభాష్ పాలేకర్ విధానాలను అవలంబించి వ్యవసాయం చేయడం అభినందనీయమని అన్నారు. అనంతరం ఆర్గానిక్ పంటలను, ఆవులను పరిశీలించారు. టీటీడీ దేవస్థానంలో వేంకటేశ్వర స్వామి వారికి ఇక్కడ పండించిన బియ్యాన్ని ప్రసాదానికి వినియోగించడం విజయరామ్ ఘతన అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించే ఆర్గానిక్ శిక్షణ కార్యక్రమానికి ముఖ్యమంత్రి, వ్యవసాయశాఖ మంత్రి హాజరయ్యేలా చూస్తానన్నారు. ప్రధాన రహదారి నుంచి వ్యవసాయ క్షేత్రం వరకు రోడ్డు నిర్మాణానికి ప్రత్యేక నిధులు కేటాయిస్తామన్నారు. ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇవ్వాలన్న విజయరామ్ లక్ష్యానికి తనవంతు సహకారం ఉంటుందన్నారు. తన వ్యవసాయ క్షేత్రంలోనూ ప్రకృతి వ్యవసాయం చేస్తానన్నారు. ధారూరు మార్కెట్ కమిటీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయంలో పండిస్తున్న వరిని పరిశీలిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

గ్రూప్-1 పరీక్షకు ప్రత్యేక బస్సులు

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రూప్-1 పరీక్షకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకట నర్సప్ప ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్షలు రాసే అభ్యర్థులు గ్రామాల నుంచి పరీక్ష కేంద్రాలకు ఇబ్బంది లేకుండా చేరడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

తల్లిదండ్రుల నిర్లక్ష్యం అభంశుభం తెలియని బాలుడికి శాపంగా మారింది. అమ్మానాన్నల సంరక్షణలో ఆనందంగా గడవాల్సిన బాల్యం.. ఎవరూ లేని అనాథలా వెక్కిరించింది. కనిపెంచిన పేగుబంధమే.. వదిలించుకోవాలని చూసింది.. అన్నీ తానై వ్యవహరించాల్సిన తండ్రి తనకేం సంబంధం లేదు.. అన్నట్లుగా వ్యవహరించాడు. ఫలితంగా మూడేళ్ల పాటు ట్రస్టులో ఆశ్రయం పొంది, రెండు రోజుల క్రితమే సొంతూరు చేరుకున్న ఓ బాలుడి భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది.

అమ్మా.. నాన్నా అంత భారమయ్యానా..

ఓ బాలుడి ఆవేదన

తల్లిదండ్రుల నిరక్ష్యం.. చిన్నారికి శాపం

- మూడేళ్ల క్రితం బస్టాండ్‌లో వదిలేసిన కన్నతల్లి
- ఎస్‌కేవీ ట్రస్టులో ఆశ్రయం పొందిన చిన్నారి
- ఇటీవలే తండ్రి చెంతకు చేర్చిన ట్రస్ట్ సభ్యులు
- కొడుకు తిరిగొచ్చాడనే సంతోషం కనిపించని తండ్రి



ఇటీవల దోమలో భరత్‌ను తండ్రికి అప్పగిస్తున్న ఎస్‌కేవీ ట్రస్టు సభ్యులు

దోమ: మండల కేంద్రానికి చెందిన బొక్క బాబు, యాదమ్మ దంపతులకు భరత్ అనే కుఏడేళ్ల కుమారుడున్నాడు. అన్యోన్యంగా సాగిపోతున్న వీరి జీవితంలో అనుకోని కలహాలు చెలరేగాయి. దీంతో ఇంటి నుంచి వెళ్లిపోవాలని నిర్ణయించుకున్న యాదమ్మ కొడుకును నీవద్దే పెంచుకో.. అని భర్తకు సూచించింది. ఇందుకు బాబు అంగీకరించలేదు. చేసేదేమి లేక ఎనిమిదేళ్ల భరత్‌ను తీసుకుని బతుకుదెరువు కోసం బయలుదేరింది. హైదరాబాద్ చేరుకుని రెండేళ్ల పాటు కూలీనాలీ పనులు చేసుకుంటూ కొడుకును సాకింది. ఆతర్వాత విజయవాడకు చేరుకుంది. ఈ సమయంలో ఆ తల్లి హృదయం పాశానంగా మారింది. నాకే దిక్కు లేదు.. వీడిని ఎలా చూసుకోవాలి అనుకుందో ఏమో.. పదేళ్ల పసి బాలుడిని వదిలించుకోవాలని డిసైడైంది. విజయవాడ రైల్వే స్టేషన్‌లో కొడుకును వదిలేసి, తన దారిన తాను వెళ్లిపోయింది. అమ్మ జాడ తెలియక వెక్కివెక్కి ఏడుస్తున్న ఆ బాలుడు భయంభయంగా రైల్వే స్టేషన్‌లోని ఓ మూలన కూర్చుండిపోయాడు. ఏడ్చిఏడ్చి కళ్లలో నీళ్లు ఇంకిపోయాయి.. అమ్మకు ఏమైందో..? ఎటు వెళ్లిపోయిందో తెలియని పరిస్థితి. ఏవైపు నుంచి వస్తుందోనని ఆత్రుతగా చూడటమే తప్ప.. అమ్మ రాలేదు.. ఏడుపు ఆగలేదు. ఇది గమనించిన ప్రయాణికులు స్టేషన్‌లో ఓ బాలుడు ఒంటరిగా ఏడుస్తున్నాడని విజయవాడ చైల్డ్‌లైన్ సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చి.. మీది ఏ ఊరు, మీ అమ్మానాన్నల పేర్లు ఏంటి అని ప్రశ్నించినా.. బాలుడి నుంచి ఎలాంటి సమాధానం రాలేదు. దీంతో చిన్నారిని తీసుకెళ్లిన చైల్డ్‌లైన్ సిబ్బంది విజయవాడలోని ఎస్‌కేవీ ట్రస్ట్‌లో చేర్పించారు. ఇది జరిగి మూడేళ్లు గడిచింది. ఈ మధ్యకాలంలో ట్రస్టు ప్రతినిధులు ఎన్నిసార్లు అడిగినా భరత్ మాత్రం తన ఊరు, తల్లిదండ్రుల వివరాలు చెప్పలేదు. వారం రోజుల క్రితం భరత్‌తో మాట్లాడిన ట్రస్టు సభ్యులకు.. వికారాబాద్ దగ్గర దోమ గ్రామమని చెప్పాడు. దీంతో పూర్తి వివరాలు తెలుసుకున్న ట్రస్టు ప్రతినిధులు శుక్రవారం బాలుడిని తీసుకుని దోమకు చేరుకున్నారు.

కన్నకొడుకు తిరిగొచ్చినా..

ప్రస్తుతం భరత్ వయసు పదమూడేళ్లు.. ఐదేళ్ల తర్వాత కన్నకొడుకును చూసిన ఆ తండ్రిలో ఏమాత్రం చలనం కనిపించలేదు. భార్య, కొడుకు ఇంటినుంచి వెళ్లిపోయిన రోజునుంచి ఒక్కసారి కూడా వారిని వెతికే ప్రయత్నం చేయలేదు. కనీసం వారు బతికే ఉన్నారా..? లేదా..? అనే సమాచారం కూడా తెలియదు. ఈ విషయమై పోలీస్ స్టేషన్‌లోనూ ఎటువంటి ఫిర్యాదు చేయలేదు. ఇవన్నీ పక్కన పెట్టినా.. నా కొడుకు తిరిగొచ్చాడు.. అని బాలుడిని చేరదీయలేదు.. ముద్దాడలేదు. ఇది గమనించిన స్థానికులు, పోలీసులు బాబుకు సర్దిచెప్పి.. భరత్‌ను అప్పగించారు. దీంతో తప్పదు అన్నట్లు కొడుకును దగ్గరకు తీసుకున్నాడు.

తన దారిన వెళ్లిపోయిన తల్లి

కుటుంబ కలహాలతో భర్తకు దూరమై, కొడుకును వదిలేసిన యాదమ్మ తనదారి తాను చూసుకుంది. ఆమె ప్రస్తుతం విజయవాడలోనే ఉన్నట్లు తెలిసింది.

ప్రశ్నార్థకంగా మారిన భవిష్యత్

అటు తల్లి దూరమై.. ఇటు తండ్రి ఆలనాపాలనా కరువైన భరత్ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. స్థానిక నాయకులు, ఎస్‌కేవీ ట్రస్ట్ ప్రతినిధుల సహకారంతో బాలుడిని వికారాబాద్‌లోని గురుకుల పాఠశాలలో చేర్పించారు. దాతలు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు ముందుకు వచ్చి భరత్ బాధ్యతలు తీసుకోవాలని, లేదా ప్రభుత్వం తరఫున చేయూత అందేలా చూడాలని సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డి, గ్రామస్తులు కోరారు.

బాగా చదువుకుంటా



నా చిన్నప్పుడు అమ్మానాన్నా నన్ను బాగా చూసుకునేవారు. ఇప్పుడు వారికి నాపై ఎలాంటి ప్రేమ లేదు. ఇద్దరూ నన్ను దూరం పెట్టేందుకే ప్రయత్నిస్తున్నారు. అమ్మ నన్ను వదిలి వెళ్లిన రోజు గుర్తొస్తేనే భయమేస్తోంది. చైల్డ్‌లైన్ వారు వచ్చి వివరాలు అడిగినా భయంతో ఏమీ చెప్పలేకపోయా. ఇప్పుడు కొంత ధైర్యం వచ్చి నా వివరాలు తెలియజేశా. దీంతో నన్ను నాన్న దగ్గరకు తీసుకువచ్చారు. కానీ ఆయనేమో నన్ను ఆదరించడం లేదు. అందరూ వచ్చి వికారాబాద్‌లోని రెషిడెన్షియల్ పాఠశాలలో చేర్పించారు. ఇకనుంచి బాగా చదువుకునేందుకు ప్రయత్నిస్తా.

– భరత్‌కుమార్

క్లుప్తంగా

బాధిత కుటుంబానికి బాల్య మిత్రుల అండ



బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న బాల్య మిత్రులు

పరిగి: తోటి స్నేహితుడు అకాల మరణం చెందడంతో బాల్య మిత్రులంతా ఏకమై బాధిత కుటుంబానికి బాసటగా నిలిచారు. మండల పరిధిలోని రూప్‌ఖాన్‌పేట్‌ గ్రామానికి చెందిన ఎంటికల పెంటయ్య ఇటీవల మృతి చెందారు. ఆయన పట్టణ కేంద్రంలోని తుంకల్‌గడ్డలో గల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 1995–96 పదో తరగతి చదివారు. అప్పటి బ్యాచ్‌ మిత్రులు పెంటయ్య కుటుంబానికి రూ.85 వేల నగదు, నిత్యావసర సరుకులను ఆదివారం అందజేశారు. మునుముందు ఎలాంటి సాయం కావాలన్న స్పందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తోటి స్నేహితులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పాత పింఛన్‌ను పునరుద్ధరించాలి

మంచాల: కాంట్రిబ్యూషన్‌ పెన్షన్‌ పథకాన్ని రద్దు చేసి పాత పెన్షన్‌ విధానాన్ని పునరుద్ధరించాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్తారి రాజిరెడ్డి డిమాండ్‌ చేశారు. ఆదివారం ఆయన మంచాలలో మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనాలోచిత విధానాల ద్వారా ఉద్యోగ, ఉపాధ్యాయుల భవిష్యత్‌ ప్రశ్నార్థకంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. భాగస్వామ్య పింఛను పథకాన్ని రద్దు చేసి పాత పెన్షన్‌ విధానాన్ని అమలు చేయాలని పీఆర్‌టీయూ 2015 నుంచి వివిధ కార్యక్రమాల ద్వారా ఆందోళన వ్యక్తం చేస్తుందన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకు వ్యతిరేకంగా అనేక రూపాల్లో నిరసనలు చేపడుతున్నామని పేర్కొన్నారు.

మోటార్‌ కేబుల్‌ వైర్‌ చోరీ



మోటార్‌ కేబుల్‌ను కత్తిరించిన దుండగులు

దోమ: గుర్తు తెలియని వ్యక్తులు బోరు మోటార్‌ కేబుల్‌ వైర్‌ దొంగిలించిన ఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. మండల పరిధిలోని తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన తిరుపతయ్యగౌడ్‌ పొలంలో బోరు మోటార్‌తో సాగు చేస్తాడు. ఎప్పటిలాగే పొలానికి నీరు పెట్టి శనివారం సాయంత్రం ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో దుండగులు బోరు మోటార్‌కు ఉన్న కేబుల్‌ వైర్‌ను కత్తిరించి ఎత్తుకెళ్లి పోయారు. మరుసటి రోజు రైతు ఉదయాన్నే వెళ్లి పొలానికి నీరు పెట్టేందుకు చూడగా.. కేబుల్‌ వైర్‌ కత్తిరించి దొంగిలించినట్లు గుర్తించాడు. ఈ మేరకు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతు తెలిపారు.

ట్రాక్టర్‌ చోరీ

కేశంపేట: మండల పరిధిలోని నిర్దవెళ్లి గ్రామంలో వ్యవసాయ పొలం వద్ద ఉంచిన ట్రాక్టర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసిన ఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. బాధిత రైతు తెలిపిన కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు బాలయ్య వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాడు. వ్యవసాయ పనులు చేసేందుకు ట్రాక్టర్‌ను కొనుగోలు చేశాడు. అయితే శనివారం ఉదయం పొలం పనులు పూర్తి అయిన తర్వాత అక్కడే ట్రాక్టర్‌ను ఉంచి రైతు ఇంటికి వచ్చాడు. గుర్తు తెలియని వ్యక్తులు ట్రాక్టర్‌ ఇంజన్‌తో పాటుగా ట్రాలీని దొంగిలించారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు రైతు తెలిపారు.

ముక్కు మూసుకోవాల్సిందే..!

అక్కడ బస్సుల కోసం వేచి చూడాలంటే ముక్కుపుటాలు అదిరిపోయే దుర్గంధాన్ని భరించాలి. ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఇదీ పరిగి బస్టాండ్‌ ఆవరణలో బస్సుల కోసం ఎదురుచూసే వారి పరిస్థితి!

- దుర్గంధభరితంగా ప్రయాణ ప్రాంగణం
- బస్టాండ్‌లో లోపించిన పారిశుద్ధ్యం
- ఆరుబయటే మూత్ర విసర్జన
- పట్టించుకోని అధికార యంత్రాంగం



అపరిశుభ్రంగా బస్టాండ్‌ ఆవరణ

పరిగి: హైదారాబాద్‌, బీజాపూర్‌ జాతీయ రహదారిపై ఉన్న పరిగి ఆర్టీసీ బస్టాండ్‌ ఆవరణలో పారిశుద్ధ్యం లోపించి కంపు కొడుతోంది. బస్టాండ్‌కు వచ్చారంటే భరించలేనంత దుర్వాసనతో ప్రయణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. పరిగి మీదుగా హైదారాబాద్‌, కర్ణాటక, మహబూబ్‌నగర్‌, షాద్‌నగర్‌ తదితర ప్రాంతాలకు నిత్యం బస్సులు నడుస్తుంటాయి. వేల సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఎంతో రద్దీగా ఉంటే బస్టాండ్‌లో మాత్రం సౌకర్యాలు లేక ఇబ్బందులకు గురవుతున్నారు. మూత్రశాలలు శుభ్రంగా లేకపోవడంతో ప్రయాణికులు ఆరుబయటనే పని రానిస్తున్నారు. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లుగా.. బస్టాండ్‌కు ఆదాయం ఉన్నా ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడంతో యంత్రాంగం పూర్తిగా విఫలమవుతుంది.

కానరాని పారిశుద్ధ్యం

బస్టాండ్‌లో ఎక్కడ చూసిన పారిశుద్ధ్యం లోపించి దుర్గంధం వ్యాపిస్తోంది. పరిసరాల్లో చెత్త చెదారం నిల్వలు పేరుకుపోయాయి. ప్లాస్టిక్‌ తదితర వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ పారవేయడంతో సమస్య మరింత తీవ్రమవుతున్నాయి. బస్టాండ్‌లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని అధికారులకు ప్రయాణికులు ఎన్నోసార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. డస్ట్‌బిన్‌లు ఎక్కడ ఏర్పాటు చేయకపోవడంతో చెత్తచెదారం చెల్లా చెదురుగా పడేస్తున్నారు. ప్రయాణికులకు మూత్రశాలలు ఏర్పాటు చేసినా నిర్వహణ లేక అధ్వానంగా మారాయి.

దుర్గంధం వ్యాప్తి

బస్టాండ్‌లో కొద్ది సేపు బస్సుల కోసం వేచి ఉండాలంటే ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. బస్టాండ్‌లో ప్రయాణికులు నిలబడడానికి దడుసుకుంటున్నారు. ఎక్కడ నిలబడిన కంపు వాసన రావడంతో అవస్థలు పడుతున్నారు. ఆరుబయట మూత్ర విసర్జన చేస్తుండటంతో పరిస్థితి దారుణంగా తయారైంది. రుసుము వసూలు చేస్తున్న మరుగుదొడ్లు సైతం కంపుకొడుతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. బస్టాండ్‌లో ఆర్టీసీ అధికారులు పారిశుద్ధ్య చర్యలు చేపట్టడంతో పూర్తిగా విఫలమయ్యారు. బస్టాండ్‌ నలుదిక్కులా దుర్వాసన వ్యాపిస్తుంది. చుట్టు పక్కల ఉన్న పలు వ్యాపారాల్లోని తినుబండారాలను తిని ప్రజలు అనారోగ్యలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి బస్టాండ్‌ను ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని ప్రయాణికులు కోరుతున్నారు.



చెత్తాచెదారంతో బస్టాండ్‌

చర్యలు తీసుకుంటాం

బస్టాండ్‌ పరిసరాలను ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచుతాం. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటాం. ఏ సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలి. పారిశుద్ధ్యం ఎక్కడెక్కడ లోపించిందో పరిశీలించి పటిష్ట చర్యలు తీసుకుంటాం.

– కరుణశ్రీ, డీఎం, పరిగి

ఉడా పరిధిలోకి జిల్లా ఎంపిక

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి వెల్లడి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌ రెడ్డి

పరిగి: జిల్లాను అర్బన్‌ డెవలప్‌మెంట్‌ అథారిటీ(ఉడా) కింద ప్రభుత్వం ఎంపిక చేస్తూ జీఓ విడుదల చేసిందని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలతోపాటు 493 గ్రామాలను ఉడా పరిధిలోకి ఎంపిక చేసిందన్నారు. ఉడా ద్వారా జిల్లాలో ప్రత్యేక అభివృద్ధి కోసం మాస్టర్‌ ప్లాన్‌ డెవలప్‌మెంట్‌ చేస్తారన్నారు. ప్రత్యేక రోడ్డు సౌకర్యాలు, నెట్‌వర్క్‌ పట్టణాలకు రింగు రోడ్డు ప్రణాళికలు జరుగుతాయన్నారు. నీటి సౌకర్యాలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని చెప్పారు. ఉడా ద్వారా జిల్లాలోని నిరుద్యోగ సమస్యల పరిష్కారానికి పరిశ్రమల ప్రణాళికలు సిద్ధం చేస్తాయన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులు

మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక రుణం ద్వారా రూ.25 కోట్లు మంజూరు చేసిందన్నారు. అందులో మున్సిపాలిటీ పక్క భవనం కోసం రూ.5 కోట్లతో భవనాన్ని నిర్మిస్తామన్నారు. మున్సిపాలిటీ అన్ని పరిధిలోని వార్డులలో రూ.20 కోట్లతో సీసీ రోడ్ల డ్రైనేజీని ఏర్పాటు చేస్తామన్నారు. రూ.16 కోట్లతో మున్సిపాలిటీలోని నీటి సమస్యలను అధిగమించేందుకు ట్యాంకులను ఏర్పాటు చేస్తామని వివరించారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధానకార్యదర్శి హన్మంతు ముదిరాజ్‌, సీనియర్‌ నాయకుడు పార్థసారథి, ఆయా మండలాల అధ్యక్షులు పరుశురాంరెడ్డి, ఆంజనేయులు, మాలివిజయ్‌కుమార్‌రెడ్డి, నాయకులు రాఘవేందర్‌రెడ్డి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రైతులను మోసగించిన కాంగ్రెస్‌



సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్‌ నాయకులు

మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి: రైతులకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ రైతులను నిలువునా మోసం చేస్తుందని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి ఆరోపించారు. ప్రభుత్వం రైతు భరోసా ఎగవేతపై ఆదివారం బీఆర్‌ఎస్‌ పార్టీ ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను బస్టాండ్‌ ముందు దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల కష్టాలను తీర్చేందుకు బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం కేసీఆర్‌ రైతు బంధు పథకం తీసుకువచ్చారన్నారు. కానీ కాంగ్రెస్‌ రైతు బంధు పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతుందన్నారు. ఎన్నికల సమయంలో రైతు భరోసాతో రూ.15వేలు ఎకరానికి ఇస్తామని చెప్పి.. ఇప్పుడు కాలయాపన చేస్తుందని మండిపడ్డారు. రైతులు పండించిన ప్రతి గింజను గిట్టుబాటు ధరతో ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి సగం మందికి కూడా ఇంకా మాఫీ కాలేదన్నారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం దఫాల వారీగా అందరికీ రుణమాఫీ చేసిందన్నారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం బీఆర్‌ఎస్‌ నాయకులపై కుట్రపూరితంగా కేసులు పెట్టిస్తుందన్నారు. అక్రమంగా కేసులు పెట్టిస్తుంటే భయపడేది లేదని చట్టపరంగా కొట్లాడుదామని కార్యకర్తలకు సూచించారు. తాను కార్యకర్తలకు ఎప్పుడూ అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్మన్‌ ముకుందఅశోక్‌కుమార్‌, పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, మాజీ ఎంపీపీ అరవింద్‌రావు, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, వెంకటయ్య, సురేందర్‌, రాజేందర్‌, రవికుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

అడవి పందులతో పరేషాన్‌!

- మొక్కజొన్న, పత్తి పంటలకు తీవ్ర నష్టం
- పంటను రక్షించడానికి రైతుల పాట్లు



ఎన్కేపల్లిలో పత్తి మొక్కలను పాడు చేసిన అడవి పందులు

మోమిన్‌పేట: ఆరుగాలం శ్రమించి మట్టి నుంచి సిరులు పండించే రైతన్నలకు అడవి పందుల బెడద కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఏ పంట సాగు చేసినా పందులు నాశనం చేస్తున్నాయని ఆవేదన చెందుతున్నారు. ఎడాదిగా కష్టపడి పండిస్తే ఒక్క రోజులోనే పంటను నాశనం చేస్తున్నాయని వాపోతున్నారు. వాటి నుంచి ఎలా పంటలను రక్షించుకోవాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. మొక్కజొన్న సాగు చేస్తే విత్తుకొనడం మొదలు కొని పంట నూర్పిడి అయి మార్కెట్‌కు తరలించే వరకు నిత్యం అడవి పందుల నుంచి ప్రమాదం పొంచి ఉంది. పత్తిని పందులు ఏమి చేయలేవని అనుకొన్న రైతుకు సైతం నష్టం తప్పడం లేదు. పత్తి కాయలు ప్రారంభం నుంచి పొలంలో కాయలను తింటున్నాయి. కింది స్థాయిలో ఉన్న కాయలు అయిపోగానే పత్తి మొక్కలను విరగొట్టి కింద పడవేసి తొక్కుతున్నాయి. దీంతో దిగుబడి దెబ్బతింటుందని కర్షకులు ఆవేదన చెందుతున్నారు.

సోలార్‌ ఫెన్సింగ్‌ భారమే

పెసర, మినుము పంటలను సాగు చేస్తే నెమలిలు, అడవి పందులు పంటలను చేతికి రాకుండా చేయడంతో వాటిని పూర్తిగా విరమించుకున్నారు. పత్తిని సాగు చేస్తే వాటిని కూడా నాశనం చేయడంతో మదనపడుతున్నారు. చీరలు, తీగలు ప్రతి పొలానికి కట్టలేమని రైతులు అంటున్నారు. సోలార్‌ ఫెన్సింగ్‌ ఈ సీజన్‌లో కష్టమేనని పేర్కొంటున్నారు. చిన్న, సన్నకారు రైతులకు సోలార్‌ ఫెన్సింగ్‌ తలకు మించిన భారమేనని భావిస్తున్నారు. ఇప్పటికే అధిక వర్షాల వల్ల పత్తి పంట పూర్తిగా దెబ్బతినడంతో రైతులు ఏమి చేయని స్థితిలో ఉన్నారు. ములిగే నక్కపై తాటికాయ పడినట్లు ఇప్పటికే రైతులు నష్టాల ఊబిలో కొట్టుమిట్టాడుతుంటే పందులు చేస్తున్న నష్టాలను ఎవరికీ చెప్పుకోవాలో అర్థం కావడం లేదంటున్నారు. అటవీశాఖ అధికారులు పందులను పంట పొలాల నుంచి తరిమికొట్టే ప్రయత్నం చేయాలని అన్నదాతలు కోరుతున్నారు.

డ్రగ్స్‌ విక్రేతల అరెస్టు

యాచారం: డ్రగ్స్‌ విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్న ముగ్గురిని హైదరాబాద్‌ గ్రీన్‌ ఫార్మాసిటీ పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. సీఐ కృష్ణంరాజు తెలిపిన వివరాలు.. రాజస్థాన్‌ నుంచి నగరంలోని నాదర్‌గుల్‌లో నివాసం ఉంటున్న సురేష్‌కుమార్‌, దినేష్‌కుమార్‌, సునీల్‌కుమార్‌లు నిషేధిత డ్రగ్స్‌ తెచ్చి బేగరికంచె సమీపంలోని అమెజన్‌ కంపెనీలో పనిచేసే ఉద్యోగులకు విక్రయిస్తున్నారు. ముందస్తు సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. విచారించగా కొంత కాలంగా డ్రగ్స్‌ను విక్రయిస్తున్నట్లు అంగీకరించారు. వీరిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు. వారి నుంచి వంద గ్రాములు మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకొన్నారు. సమాచారం అందిన వెంటనే సకాలంలో స్పందించి ముగ్గురిని అదుపులోకి తీసుకున్న ఎస్‌ఐ తేజంరెడ్డిని సీఐ అభినందించారు.

ఇంట్లోకి చొరబడి చోరీ

కేశంపేట: ఇంట్లో ఎవరూ లేని సమయంలో దుండగులు ఇంట్లోకి చొరబడి బంగారు, వెండి ఆభరణాలు చోరీ చేసిన ఘటన ఆదివారం మధ్యాహ్నం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కేశంపేటకు చెందిన అనిత తన పిల్లలతో కలిసి కూలీ పనులు చేస్తూ జీవిస్తుంది. ఆదివారం కావడంతో అనిత ఇంటికి తాళం వేసి తన పిల్లలను వెంట తీసుకొని కూలీ పనికి వెళ్లింది. ఇదే అదునుగా భావించిన గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లోని బీరువాలో ఉన్న బంగారు వెండి ఆభరణాలతో పాటుగా రూ.ఆరువేల నగదును దోచుకెళ్లారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపింది.

దేశ రక్షణే ఆర్‌ఎస్‌ఎస్‌ లక్ష్యం

తెలంగాణ ప్రాంత ప్రముఖ్‌ రాంప్రసాద్‌జీ

చేవెళ్ల: దేశ రక్షణ, హిందూ ధర్మ పరిరక్షణ కోసమే ఆర్‌ఎస్‌ఎస్‌ పనిచేస్తోందని తెలంగాణ ప్రాంత ప్రముఖ్‌, సంస్థ ప్రచారక్‌ రాంప్రసాద్‌జీ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం రాష్ట్రీయ స్వయం సేవక్‌ సంఘ్‌(ఆర్‌ఎస్‌ఎస్‌) శతాబ్ది ఉత్సవాలను చేవెళ్ల ఖండ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని హనుమాన్‌ దేవాలయం నుంచి పుర వీధుల గుండా స్వయం సేవకులు పథ సంచాలన్‌ చేపట్టారు. అనంతరం స్థానిక వివేకానంద కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన మాట్లాడుతూ.. సమాజాన్ని మేల్కొల్పడం, ప్రజలను చైతన్యవంతం చేయటం ఆర్‌ఎస్‌ఎస్‌ శాఖల ముఖ్య లక్ష్యమన్నారు. ప్రతిఒక్కరూ దేశంకోసం పనిచేయాలని సూచించారు. ప్రపంచానికి జ్ఞాన భిక్ష పెట్టిన భారత సంస్కృతి ఎంతో గొప్పదన్నారు. ప్రస్తుతం 60 దేశాల్లో ఆర్‌ఎస్‌ఎస్‌ శతాబ్ది ఉత్సవాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. హిందూ దేవాలాయలపై ముష్కరుల దాడులను ప్రతిఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. ఛత్రపతి శివాజీ, వివేకానంద వంటి మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అనంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి, మల్లేశం, మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాంప్రసాద్‌జీ

సరళ బోధన అందించాలి



ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను సన్మానిస్తున్న గ్రామస్తులు

టీపీటీఎఫ్‌ జిల్లా ప్రధానకార్యదర్శి సర్దార్‌

దోమ: డీఎస్సీ ఫలితాల్లో ఉద్యోగాలు సాధించిన నూతన ఉపాధ్యాయులు అర్థవంతమైన బోధనను అందించాలని టీపీటీఎఫ్‌ (తెలంగాణ ప్రోగ్రెసివ్‌ టీచర్స్‌ ఫెడరేషన్‌) జిల్లా ప్రధాన కార్యదర్శి సర్దార్‌ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని దిర్సంపల్లిలో గ్రామానికి చెందిన కె.నందిని, పి.పూజ, ఆర్‌.పూజిత ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో ఉద్యోగాలు సాధించారు. ఈ మేరకు వారిని గ్రామస్తులతో కలిసి ఆయన సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఎంతో కష్టపడి, ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని సాధన చేస్తే ఉద్యోగం సాధ్యమవుతుందన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ చదువుపై ప్రత్యేక దృష్టి సారించి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించే దిశగా ముందుకు సాగాలన్నారు. ఉద్యోగాలు సాధించిన వారు పేదింటి కుటుంబీకులని, రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబంలో పుట్టారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు మహ్మద్‌ ఖాజా, భగవంత్‌రెడ్డి, రాములుగౌడ్‌, అబ్దుల్‌కలాం యూత్‌ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

24న పీడీఎస్‌యూ అర్ధ శతాబ్ది ఉత్సవాలు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

చేవెళ్ల: పీడీఎస్‌యూ సంఘం ఏర్పడి యాభై ఏళ్లు అవుతున్న సందర్భంగా ఈనెల 24న ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించే ఉత్సవ సభను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి వై.గీతమహేందర్‌, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్‌ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్‌ భవన్‌లో ఆదివారం పీడీఎస్‌యూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శతాబ్ది ఉత్సవ సన్నాహాక సమావేశం నిర్వహించారు. ఈ వారు మాట్లాడుతూ.. ఉన్నతమైన ఆశయాలతో ఏర్పాడిన సంస్థ పీడీఎస్‌యూ అన్నారు. 50 ఏళ్ల పోరాట ప్రస్థానంలో విద్యార్థుల పక్షాన పీడీఎస్‌యూ బాధ్యతగా కొట్లాడిందన్నారు. కామ్రేడ్‌ జార్జిరెడ్డి, జేసీఎస్‌ ప్రసాద్‌ల అడుగుజాడల్లో నడుస్తూ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేశారన్నారు. ఈనెల 24న ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నిర్వహించబోయే పీడీఎస్‌యూ అర్ధ శతాబ్ది ఉత్సవ సభకు పెద్ద ఎత్తున విద్యార్థులు తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్‌, జైపాల్‌, అశోక్‌, సురేశ్‌, ప్రభాస్‌, తదితరులు పాల్గొన్నారు.

సందడిగా కోట్‌పల్లి ప్రాజెక్టు



అలుగు కింద ఎంజాయ్‌ చేస్తున్న పర్యాటకులు

ధారూరు: గ్రామీణ ప్రాంతంలో ఉన్న కోట్‌పల్లి ప్రాజెక్టు వద్ద పర్యాటకులు సందడి చేశారు. హైదరాబాద్‌ నగరంలో ఉంటున్న వారు, వివిధ జిల్లాల నుంచి అధిక సంఖ్యలో ఆదివారం ప్రాజెక్టుకు వచ్చి అలుగు నుంచి జాలువారుతున్న నీటిలో గంటల తరబడి ఎంజాయ్‌ చేశారు. ఫొటోలు, సెల్ఫీలకు తీసుకొని ఆత్మీయులతో పంచుకున్నారు. పర్యాటకుల రాకతో సందడి స్థానికంగా వాతావరణం నెలకొంది.



సెల్ఫీ తీసుకుంటున్న యువతులు

పార్టీ బలోపేతానికి సమష్టి కృషి



కుర్వగూడలో సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి

షాబాద్‌: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, బీజేవైఎం మండల అధ్యక్షుడు దాదె మహేశ్‌ పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని కుర్వగూడ గ్రామంలో ఇంటింటికీ తిరిగి బీజేపీ సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీజేపీ జాతీయ నాయకత్వ ఆదేశాల మేరకు పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతి బూత్‌లో నిర్వహిస్తున్నారు. పార్టీని గ్రామ స్థాయిలోనూ మరింత బలోపేతం చేయాడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని చెప్పారు. బీజేపీ ప్రభుత్వం పేద ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి తెలియజేసి పార్టీలో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో పోలింగ్‌ బూత్‌ అధ్యక్షుడు మల్లేశ్‌, దళిత మోర్చా మండల అధ్యక్షుడు మహేందర్‌, నాయకులు నరేష్‌, రామకృష్ణ, అశోక్‌, సునీల్‌, శ్రీశైలం, శివ తదితరులు పాల్గొన్నారు.

‘వర్గీకరణ’పై సుప్రీం తీర్పును అమలు చేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

షాద్‌నగర్‌: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ప్రభుత్వం యథావిధిగా అమలు చేయాలని ఎంబీఎస్సీ (మోస్టు బ్యాక్‌వర్డ్‌ షెడ్యూల్‌ క్యాస్ట్‌) సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటన్న డిమాండ్‌ చేశారు. ఎంబీఎస్సీ కులాల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు ధర్నా చౌక్‌ వద్ద నిర్వహించే నిరసన కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆదివారం షాద్‌నగర్‌లోని మండల పరిషత్‌ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటన్న మాట్లాడుతూ.. 2011 జనాభా లెక్కల ప్రకారం కాకుండా ఎస్సీ కులాల జనగణన తర్వాతే ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని అన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్‌ పార్టీ మేనిఫెస్టోలో పొందుపర్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. దళితులందరికీ కులధ్రువీకరణ పత్రాలు ఒకే అధికారి ద్వారా ఇవ్వాలని, ఎస్సీ ఉప కులాల నిరుద్యోగులకు 70శాతం సబ్సిడీతో బ్యాంకు రుణాలను కార్పొరేషన్‌ ద్వారా అందించాలని డిమాండ్‌ చేశారు. ఎంబీఎస్సీ ఉపకులాలకు ఎస్సీ కమిషన్‌, ఎమ్మెల్సీ, రాజ్యసభ తదితర నామినేటెడ్‌ పదవుల్లో అవకాశం కల్పించాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రత్యేక అవకాశాలు కల్పించాలని కోరారు. డిమాండ్ల సాధన కోసం ధర్నా చౌక్‌ వద్ద చేపట్టే నిరసన దీక్షను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు దివాకర్‌, బాల్‌రాజ్‌, నాగరాజు, బీరయ్య, భీమన్న తదితరులు పాల్గొన్నారు.